# కదిలిస్తే .. ..

## 1

పైడయ్యా! బియ్యం తెచ్చుకున్నావా? కేజీ యెంతా? యజమానురాలు సువర్చల అడిగింది.

కేజీ పదిహేను రూపాయలు, పదికేజీల బియ్యం తెచ్చి సాను, మీక్కావాలా? రెండు కేజీల బియ్యం సాలా?

నాకెందుకూ? యెంతకిచ్చారో రేషన్‌కార్డు మీద యెన్ని చ్చారోనని అడిగాను, కేజీ యేడు రూపాయలన్నరే!

అయ్యి తినలేం, లావుగా ఉంది, ధాన్యం యేరాలి, మా యాలిగారు బియ్యం బాగుసేయలేరు, టైం సాలదు. బాలింత రాలు, పిలగాడికి ఆరోనెల వచ్చింది, క్రింద దింపితే యేడు స్తాడు, తాను కూకోలేదు అని యీ పొడుగున ఉమ్మేశాడు వాచ్‌మన్ పైడితల్లి.

రేషన్ బియ్యం తెచ్చుకోలేదు, నలభై అయిదు కేజీలిస్తు న్నారు కార్డుమీద, బియ్యం మేలురకంవి వచ్చినయ్యన్నారే, తెల్లగా సన్నగా ఉన్నాయట!

ఆ యిచ్చిన రేషన్ బియ్యం యెప్పుడో అయిపోయినై, పొద్దునారు కేజీలూ, రాత్రి ఆరు కేజీలు వండేస్తది మా యాలి గారు, కార్డుమీదిచ్చేవి సాలవు, పది పొట్టలు నిండాల రెండు పూటలా, పిల్లలు మూడుపూటలా తింటారు అన్నాడు చుట్టపొగ పీలుస్తూ.

అంతా చిన్న పిల్లలేగా, రెండుపూటలా టీ తాగుతారుగా అన్నదాశ్చర్యపోతూ.

టీ తాగుతారు, అన్నమూ తింటారు, నువ్విచ్చే టీ యెవ్వరికీ సాలదు, టీ కొట్లో గిన్నెడు టీ కొని తెస్తాను రెండుపూటలా, ఇదుగో గిన్ని, స్టీలు గిన్ని కొన్నాను అని గిన్నె తెచ్చి చూపాడు, గిన్నె పెద్దదే.

రేషన్ పంచదార తెచ్చుకున్నావూ?

మన పక్కింటి ఆఫీసరు కిందటి నెల అడిగితే, ఆరింటో యేదో పార్టీ ఉన్నదంటే, తీపి చేయాలంటే యిచ్చినాము కార్డు బ్లాకులో యిరవై రూపాయలు కేజీ పంచదార అంటున్నాడని మెత్తుకున్నదాయమ్మ. ఇనలేక మా కార్డుమీద తెచ్చుకోమన్నాను, మా కార్డుమీద పదికేజీలిస్తారు తెచ్చుకో తల్లీ అన్నాను, మేము బ్లాకులో కొంటాములెమ్మని సెప్పినాను, ఈ నెల మా బామ్మర్ది అడిగితే, యాడా పంచదార దొరకలేదంటే అడికమ్మేసినాను పదికేజీల పంచదారా, బామ్మర్దే అయినా కేజీకి పదేను రూపాయలిచ్చినాడు, నీకు కావాలా? గుర్తుసేయి, నీకిస్తాను అని కర్ర వూపుకుంటూ వెళ్ళిపోయాడు పైడితల్లి.

2

కార్డుమీద కిరోసిన్ యిస్తున్నారుటగా అప్పయ్యమ్మా! యెంతిస్తున్నారు? పామాలిన్ ఆయిల్ తెచ్చుకున్నావా? అనడిగింది యజమానురాలు.

యేమో! ఈ నెల నా మగడు తేనేలేదు, నేను రేషన్‌సాపు కెల్లిను, అందరూ మీద బడతారు, నెట్టుతారు, ఇంటికొచ్చి తాన మాడాలి, అత్తూరుకోదు, అడ్డమైనవాల్లను తాకొచ్చినావంటది,

నీళ్లేవీ, కొలాయి వదల్లేదు, నేను విడిగా కిరోసిన్ కొన్నాను డబ్బా వస్తదే వాడి దగ్గర కొన్నాను, నీకొక్కవాలా? లైట్లు రాలేదే, కరెంటు పొదుపు చేస్తున్నారట, ఒక బుడ్డీ సాలా? తెస్తానుండు అని కూతుర్ని కేకేసింది.

నేను పామాలిన్ వాడను, వేరుసెనగ నూనె వంటకి వాడతాను, అరిసెలు చేస్తే నెయ్యికొని వాడతాను, ఇయాల వెన్న కొనుక్కొచ్చాను, ఈడికి బేదుల్లౌతుండాయి అని చంకలో బిడ్డను చూపింది.

రగతం పడతా ఉన్నది, వెన్న తినిపిస్తే కట్టుకుంటాయి అని ముద్దులాడింది బిడ్డని.

మందు వాడవూ?

మాకు మందులు కొనే అలవాటే లేదు, మునుపు డాకటేరు గారింటికి వాచ్‌మన్‌గా పనిచేసినాడు మా మొగోడు, ఆ డాక్టరు బాబే దినామూ ఒల్లుచూసి మందులిచ్చేవారు, మేమడగనే అడిగేవారం గాదు, ఆరెల్లిపోయినారు, నేనే నాకు సేతనైన వైద్యం సేస్తాను, మంత్రమేస్తాను, పసర్లు వాడతాను, దాని పేరు పసరు వైద్యం అని చుట్ట నోట్లో పెట్టుకు తీసింది కాల్తున్న వేపు నోటిలో పెట్టుకున్నది అప్పయ్యమ్మ, అడ్డపొగ నోరు వేడెక్కిస్తుందిట చెప్పింది అప్పయ్యమ్మ వాచ్‌మన్ భార్య.

పొగ తాగేవాళ్ళు మంత్రం వేస్తే పారదన్నారే?

చుట్ట తీసి పొగసుగా పట్టుకుని చిటికెన వేలుతో పొడి రాల్చి అన్నది. సుట్ట యేమీ సెరుపు సేయదు, అబద్ధమాడ రాదంతే, నా మంత్రం పని సేస్తది, సిద్ధుడుపదేశించినాడు.

వచ్చసార్లు జపించినాను, పునచ్చరణ సేయించినాడు, నీకు తేలుకుట్టినా అంటున్నడి, మళ్ళా చుట్ట తాగుతున్నది.

నాకు తేలుకుట్టట మెందుకూ?

బోనీ వద్దులే, బెణుకూ, వాపూ వాటికీ వేస్తాను. పచ్చ కామెర్లు కాతరాకు పసరుతో నయమౌద్ది అని పెళ్ళిపోయింది.

## 3

పిల్ల పెళ్ళి నిబద్ది సేసినాము, మీరేమైనా యియ్యాల అయిదేళ్ళనించీ నమ్మకంగా సేస్తన్నాము అని నిలబడ్డాడు పైడితల్లి.

అప్పుడే పెళ్ళి! యజమానురాలు సువర్చల ఆశ్చర్య పోయింది.

అప్పడే యేంది తల్లీ! పిల్ల పెద్ద అయి రెండేండ్లయి నాది, పదారో యేడొచ్చేసినాది, పెళ్ళి సేసేయకపోతే సెగిసి పోవచ్చు, అన్నీ కొనేస్తిమి, కట్నం సిద్ధం సేస్తిని, ఉద్దేగం మీద లోను యిస్తురు అదికారులు.

యెంతేమిటి కట్నం?

యాభై వేలు కట్నం, పాతికవేలు పెళ్ళి కర్సులకు, పన్నెండువేలు విందుకు, యిందులో ఒక లోటా మందు పోయాల, దానికో పదివేలు, పన్నెండు డబ్బాల రిఫైం డాయిలు కొనేస్తిని, ఇంగా సారె యివ్వాలంటే, పట్టి మంచం పరుపూ, దిండూ, దుప్పట్లు రెండూ, రెండు బిందెలు ఒక్కొటీ వేయి రూపాయలు, పళ్ళేలు రెండు, గలాసులు రెండు, వప్పె

బియ్యం కొనేసి దాచినాను, ఇంకా కోళ్ళూ గొఱ్ఱెలూ కొనాల ఆడే కొంటాము రా, అన్నారు వియ్యాలవారు, కోడివెయ్యి మేకగానీ, గొఱ్ఱెగానీ వట్నాలు గొందలు. ఇంకా దీపాలూ, మేళాలూ, వూరేగింపు కారుకీ, బయానా యియ్యాల. అంటూ సిగరెట్ పైకి తీసాడు పైడివల్లి, అగ్గిపుల్ల పారేయి. అన్నాడు,

తూలుతూ నిలబడుతూ చెవ్వ కెల్లాడు.

నువ్వంత ఖర్చు చేసి కట్నమిస్తుంటే, వాళ్ళుకోడలికేమైనా పెట్టద్దా? యేం పెడ్తామన్నారు?

పెడ్తారు. కలవోరికే యిస్తున్నాను బిడ్డెను. వాళ్ళు వంటలు గింటలు చేయించరు. కెంపులబిళ్లా, జూకాలూ రాళ్ళ కమ్మలూ, నానూ, గొలుసూ, గాజులూ, పట్టుసీరలునాలుగూ, రయికలూ పెడ్తారు. అన్నాడు గర్వంగా, యెఱ్రనికళ్లు

వరుని అర్హత లేమిటి?

తూ తూ వుత్తాడు. పుగాకొ్కడలమ్ముతాడు. హాస్టల్లో సర్వర్‌గా వుద్యోగం. నూకమ్మగుడి వారిదే. సినిమాహాలులో బాగమున్నది. మందు సప్లైచేస్తాడు. పాలపొట్లాలమ్ముతారు బ్లాకులో. నాలుగాటోలున్నాయి. అద్దెకిస్తారు.

సువర్చల లోనికివెళ్లివచ్చి ఒకకాగితంపొట్లం సాదాచీరా జాకట్టూ కొత్తవిప్పంచి పసుపూ కుంకం పూలదండావుంచి తెచ్చి యిచ్చి, నూరునోటు చేతికిచ్చింది.

చుట్ట విసిరేసి పొట్లం తీసుకున్నాడు పైడితల్లి.

నువ్వూ బాబూ పెళ్లికి రావాల, వెయ్యి యిస్తారని ఆశ పెట్టుకొన్నాను. అప్పుతీర్చాల. అన్నాడు విచారంగా.

ఈఊళ్లోగాదే పెళ్ళి : అన్నది.

కారు పంపిస్తా డ్రైవరు నా బామర్ది. అనిమొక్కి వెళ్లి పోయాడు పైడయ్య.

— (౦) —